సహకార బ్యాంక్ వారోత్సవాలు

ప్రజాశక్తి -డుంబ్రిగూడ: గుంటసీమలో కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ బికె నాయుడు ఆధ్వర్యంలో బుధవారం అరకులోని సహకార బ్యాంకు వద్ద అఖిలభారత సహకార బ్యాంకు వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ సహకార జెండాను ఆవిష్కరించారు. 1904లో సహకార బ్యాంకు వ్యవస్థ ప్రారంభం కావడంతో బ్యాంకులు ఉద్భవించాయని చెప్పారు. ఇప్పటికీ అనేకమంది రైతులకు రుణాలు ఇస్తూ సహకారం అందిస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అరకులోయ కోపరేటివ్ బ్యాంక్ చైర్పర్సన్ హస్తిన కుమార్, సీఈవో అచ్చన్న, గోవింద్, అరకువేలి మండల వైస్ ఎంపీపీ రామన్న పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్

మన్యంలో తగ్గిన ఉష్ణోగ్రతలు

మినుములూరులో 10, చింతపల్లిలో 8.2, పాడేరులో 12 డిగ్రీలు నమోదు

కాంప్లెక్స్ వద్ద కమ్మిన మంచు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత అధికమైంది. ఉదయం 9 గంటల వరకు పాడేరు, చింతపల్లి, అరకులోయ ప్రాంతాలలో పొగ మంచు దట్టంగా కురుస్తోంది. 10 గంటల వరకు భానుడు కనిపించ లేదు. పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీ బోర్డు వద్ద 10డిగ్రీలు, జిల్లా కేంద్రం పాడేరులో 12, చింతపల్లిలో 8.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నెలకొంది. ఏజెన్సీలో ఉష్ణోగ్రతలు క్రమేపి మరింత తగ్గే పరిస్థితులు నెలకొన్నాయి. పొగ మంచు అధికంగా ఉండటంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్ని దుస్తుల వినియోగం పెరిగింది. వాహన చోదకులు లైట్లు వేసుకునే వాహనాలు నడుపుతున్నారు. వ్యవసాయ పనులు, వారపు సంతలకు వెళ్లే గిరిజనులు పొగ మంచుతో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా మండల కేంద్రాలతో పాటు గిరిజన గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఏజెన్సీని సందర్శిస్తున్న పర్యాటకులను పొగ మంచు అందాలు ఆకర్షిస్తున్నప్పటికీ చలిపులితో వణుకుతునే అహ్లాదకర వాతావరణంలో సందడి చేస్తున్నారు.

లైట్ల వెలుగులో వాహనదారులు

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు సత్యనారాయణ, చిత్రంలో ఎంపిపి లక్ష్మి తదితరులు

ఉపాధ్యాయులు లేకుండా చదువులెలా వస్తాయి?

- తక్షణమే టీచర్ పోస్టులను భర్తీ చేయాలి

- ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి-విఆర్.పురం

పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకుండా చదువులెలా వస్తాయని ఎంపిపి కారం లక్ష్మి అధికారులను, ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం ఆమె మండలంలోని సోములగూడెం గిరిజన సంక్షేమ బాలిక ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు, పాఠశాల సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 320 మంది విద్యార్థినులు ఉన్న ఈ పాఠశాలలో 22 మంది ఉపాధ్యాయులు ఉన్నారని, వారిలో ఐదుగురు విద్యా వాలంటీర్లు అని తెలిపారు. నాడు-నేడు అంటూ పాఠశాలలకు రంగులు వేస్తే చదువులు రావని, ఉపాధ్యాయులను నియమిస్తే చదువులు వస్తాయని హితవుపలికారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో వెంటనే ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కనీసం వసతి గృహానికి నైట్ వాచ్‌మెన్ కూడా లేకపోవడం దారుణమన్నారు. గిరిజన విద్యార్థులపై చిన్నచూపు తగదని ఏజెన్సీ పాఠశాలలపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, పంకు సత్తిబాబు, సర్పంచ్ పులి సంతోష్ కుమార్ తదితరులు ఉన్నారు.

విరబూసిన వలిసెపూలు

తోటల్లో విహరిస్తున్న పర్యాటకులు

ప్రజాశక్తి-పెదబయలు: ఆంధ్ర ఊటీ అరకు నియోజక వర్గం పెదబయలు మండలంలో వలిసె పూలు తోటలు కళకళలాడుతున్నాయి. వాణిజ్య పంట అయిన వలిసే పూలు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. పర్యాటకులు ఈ తోటల మధ్యలో విహరిస్తున్నారు. ప్రతి గ్రామంలో పోడు వ్యవసాయ పంట పొలంలో వలిసే పూల అందాల సోయగాలు విరజిమ్ముతున్నాయి. మూడు నెలలకే మంచి గిరాకీ వచ్చే వలిసే పంటతో రైతులు కొంత మేర లాభ పడతారు. ప్రతి ఏడాది వలిసెల పంటను జిసిసి కొనుగోలు చేస్తుంది. గిట్టుబాటు ధర పలకక పోవడంతో ప్రయివేటు దళారులే కొనుగోలు చేస్తూ మోసాలకు పాల్పడుతు న్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో జిసిసి గిట్టుబాటు ధర పలికే విధంగా కొనుగోలు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

సంక్రాంతి పండుగ సమయంలో ఆదివాసి గిరిజన కుటుంబాలు వలిసే నూనెతో వివిధ రకాలైన రుచుల పిండి వంటలు చేస్తారు. కల్తీ నూనెలు వినియోగించి అనారోగ్యంకు పాల్పడుతున్న తరుణంలో వలిసే నూనె గొప్ప ఔషధంగా భావించి వినియోగిస్తారు. కొన్ని రకాల వ్యాధులకు కూడా ఈ వలిసే నూనె నివారణకు ఉపయోగిస్తారు. ప్రకృతి అందాల నిలయంగా అరకు నియోజకవర్గం మరింత మెరుగు పడాలంటే వలిసె పూల తోటలు మరింత అభివృద్ధి చేసి ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం చేయూత నివ్వాలని గిరిజనులు కోరుతున్నారు.



20న రాష్ట్రస్థాయి విద్యా సదస్సు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: ఈనెల 20న పాడేరులో జరిగే గిరిజన సంక్షేమ, విద్యారంగ సమస్యలపై జరిగే రాష్ట్రస్థాయి విద్యా సదస్సు పోస్టర్‌ను మండల కేంద్రంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఆర్.పుండరీ అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుండారి మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న అన్ని ఐటీడీఏలలో నిర్వహించిన జీపు జాతాలో భాగంగా వచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకు రాష్ట్రస్థాయి విద్యాసదస్సు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని ఐటీడీఏల నుండి గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులు, యుటిఎఫ్ శాఖలు సుమారు 400 మందితో భారీ ఎత్తున సదస్సు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గిరిజన విద్యారంగం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. 11 సంవత్సరాలుగా సిఆర్టి లతో బోధన చేయిస్తున్న ప్రభుత్వం వారి జీతాలు 10 నెలలకు కుదించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.నాగేశ్వరరావు, గోపి, జిల్లా కార్యదర్శి యమ్.ధర్మారావు, కార్యవర్గ సభ్యులు దనుపతి, రఘుమణి, చిన్నయ్య, దయానిది, రాజు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

మాట్లాడుతున్న ఐటిడిఎస్ పీడీ సూర్యకుమారి

మండలంలో ఐసిడిఎస్ పీడీ పర్యటన

ప్రజాశక్తి-కొయ్యూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా ఐసిడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి బుధవారం కొయ్యూరు మండలంలో పర్యటించారు. రాజేంద్రపాలెం అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. సక్రమంగా సేవలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి, విద్యార్థినులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో విజయ కుమారి, పలువురు సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

మంచి కథనాలతోనే జర్నలిస్టులకు గుర్తింపు

ఎపిటిఎర్ఏ అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్, లింగమూర్తి

ప్రజాశక్తి-హుకుంపేట: ప్రజల గొంతుకగా నిలిచే మీడియా ప్రజాస్వామ్యానికి నాల్గవ స్తంభం అని, మంచి కథనాలు రాస్తే విలేకర్లకు గుర్తింపు ఉంటుందని ఎపిటిఅర్ఏ మండల అధ్యక్షులు, కార్యదర్శి కె.ఆనంద్, పి.లింగమూర్తి తెలిపారు. మండలం కేంద్రలోని స్టూడియోలో జాతీయ పత్రికా దినోత్సవం బుధవారం నిర్వహించారు. ముందుగా మృతి చెందిన జర్నలిస్టులకు మౌనం పటించారు. అనంతరం కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిజాన్ని నిజాయితీగా నిర్భయంగా రాసినప్పుడే పత్రిక రంగంలో విలేకరిగా గుర్తింపు వస్తుందన్నారు. భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తోన్న తీరుపై మీడియా పై కథనాలు రాయాలన్నారు. ఈ కార్యక్రమం లో పాండు, నాగరాజు, నూకరాజు, శ్రీను పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆనంద్, లింగమూర్తి

పరీక్షలు చేస్తున్న వైద్యులు

గొందివలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొర్ర సబ్ సెంటర్ పరిధిలోని గొందివలస గ్రామంలో బుధవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి పి.రాంబాబు వ్యాధిగ్రస్తులకు చికిత్సలు అందించి, మందులను పంపిణీ చేశారు. గ్రామంలోని ఇంటింటికి తిరిగి వ్యాధిగ్రస్తులకు వైద్య సిబ్బంది చికిత్సలు అందించారు. అనంతరం వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారి సలహాలు, సూచనలను గ్రామ గిరిజనులకు అందించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, నివాస గృహాల చుట్టు పక్కలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 104 వైద్యాధికారి సిద్దార్థ, హెల్త్ సూపర్వైజర్ పి.సాంబశివరావు, హెచ్‌వి పద్మ, ఎమ్ఎల్ హెచ్‌పి కోమలి, ఏఎన్ఎం సుశీల పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు

కిలగాడలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని కిలగాడ పంచాయతీ కేంద్రంలో స్థానిక సర్పంచ్ శివశంకర్, పంచాయతీ కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో బుధవారం పారిశుధ్య పనులను చేపట్టారు. గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. డ్రైనేజీలో పేరుకు పోయిన చెత్తాచెదరాన్ని తొలగించి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా సర్పంచ్ శివశంకర్ మాట్లాడుతూ, గ్రామంలో పారిశుధ్యం మెరుగునకు గ్రామస్తులు సహకరించాలని, తడి,పొడి చెత్త వేరు వేరుగా అందజేయాలన్నారు. గ్రామంలో బహిరంగ ప్రదేశాలలో చెత్తను వేస్తే రూ.100లు జరిమానా విధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శ్రీను, గ్రామ వాలంటీర్స్ రాంబాబు, బాబూలాల్, కనకాలమ్మ, క్రాప్ మిత్ర సభ్యులు గోపాల్ ఉపేంద్ర, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబలం పూజ

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం అయ్యప్ప స్వామి అంబలం పూజ భారీ ఎత్తున ఏర్పాటు చేశారు. జి.మాడుగులకు చెందిన సాయిబాబా పీఠం అయ్యప్ప స్వాములు ఈ పూజా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 6 మండలాల నుండి 500 మంది అయ్యప్ప స్వామి భక్తులు తరలివచ్చారు. భారీ సెట్టింగ్లు భక్తులను, గ్రామస్తులను ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున ప్రజలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అర్ధరాత్రి కారడవిలో ఆగిన ఆర్టీసీ బస్సు

- భయాందోళన చెందిన ప్రయాణికులు

- చలితో తీవ్ర ఇబ్బందులు పడ్డ వైనం

ప్రజాశక్తి -సీలేరు

ఆర్టీసీ నైట్ సర్వీసు బస్సు చింతపల్లి సమీపంలోని కారడవిలో మంగళవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో మరమ్మతులు గురై నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. చలితో అనేక ఇబ్బందులు పడ్డారు. మధురవాడ డిపోకు చెందిన 3408 నెంబర్ గల ఆర్టీసీ అల్ట్రా డీలక్స్ నైట్ సర్వీస్ బస్సు మంగళవారం సాయంత్రం 6 గంటలకు భద్రాచలంలో బయలుదేరి రాత్రి 9.30 గంటలకు సీలేరు చేరింది. ఈ బస్సులో సుమారు 40 మంది ప్రయాణికులు ఉన్నారు. సీలేరులో భోజనాలు అనంతరం బయలుదేరి వెళ్తుండగా, చింతపల్లికి దగ్గరికి వెళ్లేసరికి బస్సు కింద భాగం నుంచి పెద్ద శబ్దాలు రావడంతో పాటు టైర్ల నుంచి పొగలు బస్సులో కమ్మేయడంతో గాఢనిద్రలో ఉన్న ప్రయాణికులు మేలుకొని ఏం జరుగుతుందో తెలియక ఆందోళనకు గురయ్యారు. వెంటనే డ్రైవర్‌కు విషయం చెప్పారు. అయినా డ్రైవర్ పట్టించుకోలేదు. చింతపల్లి కాంప్లెక్స్‌లో కూడా బస్సుకు ఏమైందో తెలుసుకొనే ప్రయత్నం చేయలేదు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో చింతపల్లి నుంచి రెండు కిలోమీటర్లు దాటిన తర్వాత బస్సు ఒక పక్కకు ఒరిగినట్లు అనిపించడంతో డ్రైవర్ అప్పుడు బస్సు ఆపి కిందికి దిగి పరిశీలించగా బస్సు మరమ్మతులకు గురైనట్లు గుర్తించారు. ఈ విషయాన్ని ఆర్టీసీ ఉన్నత అధికారులకు డ్రైవర్ తెలియజేయడంతో అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో చింతపల్లి కాంప్లెక్స్‌లో నైట్ హాల్ట్ ఉన్న నర్సీపట్నం డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సును ఏర్పాటు చేసి ప్రయాణికులను నర్సీపట్నం తరలించారు. కారడవిలో బస్సు ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. చలి తీవ్రత అధికంగా ఉండడంతో గంటన్నర పాటు గజగజ వణుకుతూ ఇబ్బందులు పడ్డారు. నర్సీపట్నం వెళ్ళిన తర్వాత విశాఖపట్నం వెళ్లడానికి అధికారులు బస్సును ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చలిలో వణుకుతూ సుమారు గంటసేపు నర్సీపట్నం కాంప్లెక్స్‌లో ప్రయాణికులు నిరీక్షించారు. విశాఖపట్నం డిపోకు చెందిన మరో అల్ట్రా డీలక్స్ బస్సు భద్రాచలం నుంచి నర్సీపట్నం కాంప్లెక్సు బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు వచ్చింది. ఆ బస్సులో ఈ ప్రయాణికులను ఎక్కించారు. ఘాట్ రోడ్డులో కాలం చెల్లిన బస్సులు నడుపుతూ ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని పలువురు ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు ఘాట్ రోడ్డులో కండిషన్ ఉన్న బస్సులను నడపాలని కోరుతున్నారు.

అర్ధరాత్రి ఆగిపోయిన ఆర్టీసీ బస్సు,

అడవిలో బిక్కుబిక్కుమంటూ ఉన్న ప్రయాణికులు

కార్మికులు సంఘటితంగా పోరాడాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వీరమ్మ, సూర్యకుమారి

ప్రజాశక్తి - ఎటపాక

సమస్యలపై అన్ని రంగాల కార్మికులు సంఘటితంగా పోరాటం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ పిలుపునిచ్చారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) మండల రెండవ మహాసభ బుధవారం ఎటపాకలో జరిగింది. ఈ మహాసభలో అంగన్వాడీ యూనియన్ మండల అధ్యక్షులుగా తలారి వీరమ్మ, కార్యదర్శిగా బండారు సూర్యకుమారి, కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకట్ మాట్లాడుతూ కార్మిక చట్టాలను, హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్ తీసుకొచ్చిందని తెలిపారు. వాటిని కేంద్రం ఉపసంహరించుకునే వరకు కార్మికులంతా ఐక్యంగా పోరాడాలన్నారు. అంగన్వాడీ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వాటిని సాధించే వరకు పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షుడు జి.హరినాథ్, యూనియన్ నాయకులు మాధవి, కుమారి, రాణి, వెంకట రమణ, స్రవంతి, మణీశ్వరమ్మ, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉన్ని దుస్తులు ధరించి చలి మంటలు కాగుతున్న యువకులు

వణికిస్తున్న చలి

దట్టంగా కురుస్తున్న మంచుతో ఇబ్బందులు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో చలి తీవ్రత అధికమైంది. ఒక వైపు మంచు కమ్మేస్తుండగా, మరో వైపు చల్లటి శీతల గాలులు వీస్తుండడంతో చలి ఒక్కసారిగా పెరిగిపోయింది. చలి తీవ్రతకు వృద్ధులు, చిన్నపిల్లలతో పాటు పెద్ద సైతం తాళలేక ఉన్ని దుస్తులు ధరిస్తున్నారు. మంగళ, బుధవారాల్లో ఉదయం నుంచి కమ్మేసిన మంచు తెరలు వీడడం లేదు. ఉదయం 7 గంటల దాటినా సూర్యుడు కనింపచడం లేదు. దీంతో గిరి రైతులు వ్యవసాయ పనులకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. సీలేరు నది పరివాహక ప్రాంతాల్లో గిరిజనులు రాత్రివేళ చలిమంటలు కాగుతూ మంటలు సమీపంలోనే నిద్రిస్తున్నారు. మరో వైపు యువత ఈ మంచును, చలిని ఆశ్వాదిస్తూ స్థానిక రిజర్వాయర్ నుంచి గుంటవాడ వరకు వాకింగ్ చేస్తున్నారు.

ఇఒపిఆర్‌డిగా శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - రాజవొమ్మంగి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఇఒపిఆర్‌డిగా వి.వెంకట శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఇఒపిఆర్‌డిగా, ఇన్‌ఛార్జి ఎంపిడిఓగా పనిచేసిన కొంపెల్ల కామేశ్వరరావు బదిలీపై వెళ్లడంతో ఆరు నెలలుగా ఈ పోస్టు ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో ఏలేశ్వరంలో ఇఒపిఆర్‌డిగా, ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్న వెంకట శ్రీనివాసరావు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

జల్ జీవన్ మిషన్ పనులకు భూమి పూజ

ప్రజాశక్తి -విఆర్.పురం

మండలంలోని పెద్ద మంటపల్లి పంచాయతీలో జల్ జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికి తాగునీటి కుళాయిల ఏర్పాటు పనులకు స్థానిక సర్పంచి వెట్టి లక్ష్మి బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసి తాగునీరు అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, శాఖ కార్యదర్శి కారం సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి సందర్శన

ప్రజాశక్తి-పాడేరుటౌన్: లెప్రసి వ్యాధి గుర్తింపు, ప్రచార కార్యక్రమాన్ని బుధవారం అల్లూరి జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి ఎడిఎం అండ్ హెచ్‌ఒ సుబ్రమణ్యం పర్యవేక్షించారు. ఈ నెల 15 నుంచి వచ్చే నెల 5 వరకు జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా బుధవారం పాడేరు మండలం మినుములూరు పిహెచ్‌సిని సందర్శించారు. ఇందులో భాగంగా స్థానికులకు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యంగా చర్మంపై స్పర్శ లేని మచ్చలు, నొప్పితో కూడిన నరాలు, నొప్పి తెలియని పుండ్లు చేతలు, పాదాలపై ఉండటం వంటి లక్షణాల ద్వారా ఈ వ్యాధిని గుర్తించవచ్చని తెలిపారు. అటువంటి లక్షణాలు కలిగిన వారు దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను సంప్రదించాలని సూచించారు. పిహెచ్‌సి పరిధిలోని సర్వేను పరిశీలించి సూచనలు చేశారు. ఒపి, ఆసుపత్రిలోని మందులు, లేబర్ రూమ్, టిబి యూనిట్, రికార్డులు పరిశీలించారు. అంతకు ముందు పాడేరు జిల్లా ఆసుపత్రిని సందర్శించి ఐసిటిసి కేంద్రం, ల్యాబ్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సూపర్వైజర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

ప్రజాశక్తి - పెదబయలు: అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టని వైసిపి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని జనసేన మండల అధ్యక్షుడు జాగరపు పవన్ కుమార్ తెలిపారు. బుధవారం అరడకోట పంచాయతీ నిమ్మగుంట గ్రామంలో జనసేన బృందం పర్యటించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో గ్రామస్తులు, యువత గ్రామంలో నెలకొన్న సమస్యలను నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. తాగునీరు, డ్రైనేజీ, సిసి రోడ్డు లేక నానా అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు వాపోయారు. మండల కేంద్రానికి వెళ్లే రహదారి మట్టి రోడ్డు కావడంతో వర్షాలు పడితే బురదమయంగా మారి రాక పోకులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. గ్రామంలో 20 మందికి పైగా చిన్నారులు ఉన్నా అంగన్వాడి కేంద్రం లేక పిల్లలు పక్క ఊరికి వెళ్లవలసి వస్తుందని ఆవేదన చెందారు. ఈ కార్యక్రమంలో జన సైనికులు బాబూరావు, అప్పారావు, సన్నిబాబు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి -హుకుంపేట: శాఖ గ్రంథాలయంలో 55వ గ్రంథాలయం వారోత్సవాలు స్థానిక ఆ శాఖ అధికారి మనీషా ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయుడు లంబన్న మాట్లాడుతూ, విద్యార్థులు విద్యా దశలోనే పుస్తకాలు చదివే అలవాటు అలవర్చుకోవాలని ఆయన అన్నారు. గ్రంథాలయ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేస్తున్న పుస్తకాల ప్రదర్శన పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాసవి, సుమిత్ర పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు అదనంగా 17 పోలింగ్ కేంద్రాలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు గతంలో 77 పోలింగ్ స్టేషన్లు ఉండగా ప్రస్తుతం అదనంగా 17 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్లు విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టభద్రుల శాసనమండలి ఓటరు నమోదుకు సంబంధించి వ్యక్తిగత క్లెయిములు, ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను ఈ నెల 23 నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు.

పాడేరు కళాకారుల మయూర థింసా నృత్యం

ఉత్సాహంగా గిరిజన గౌరవ దినోత్సవం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : భారత ప్రభుత్వం గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ (మోటా) ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన మంగళవారం ప్రారంభమైన గిరిజన గౌరవ దినోత్సవం బుధవారం ఉత్సాహంగా సాగింది. బుధవారం కార్యక్రమంలో సీతంపేట, పార్వతీపురం, పాడేరు, రంప చోడవరం, చింతూరు, కెఆర్ పురం, నెల్లూరు, శ్రీశైలం ఐటిడిఎ గిరిజన సాంస్కృతిక ప్రదర్శన కళాకారులు నృత్య రూపాలను ప్రదర్శించారు. సీతంపేటకు చెందిన సవర కళాకారుల కంది కోతలు నృత్యం, పార్వతీపురం సవర కళాకారులచే సవర థింసా నృత్యం, శ్రీశైలం చెంచు కళాకారులు చెంచు నృత్యం, పాడేరు కళాకారులు మయూర థింసా, ఖోండు, కెఆర్.పురం, చింతూరు కళాకారులు కొమ్ము కోయ నృత్యం, నెల్లూరు ఐటిడిఎకు చెందిన యానాది కీలు గుర్రం నృత్యం ప్రదర్శించారు. 8 ఐటిడిఎ ప్రాంతాల గిరిజన కళాకారులు తమ కళాఖండాలు, చేతిపనులకు సంబంధించిన వస్తువులను వేదిక వద్ద ఎగ్జిబిషన్ కమ్ సేల్ కోసం కేటాయించిన స్టాల్స్‌లో ప్రదర్శించారు. ఇక్కడ ఏర్పాటుచేసిన 25 స్టాల్స్‌లో వెదురు, క్లే, చెక్క క్రాఫ్టులు, బిస్కెట్లు, జనపనార సంచులు నెగ్-ఫైర్ ద్వారా ప్రైమర్‌లు, అల్లూరి సీతారామరాజు ఆర్ట్ గ్యాలరీ, మెడికల్ స్టాల్, వెదురు చికెన్, జిసిసి ఉత్పత్తులు, కాఫీ, సిల్వర్ ఓక్ ప్రత్యక్ష ప్రదర్శనలో ఉంచారు.

మందకొడిగా స్థిరాస్తి వ్యాపారం

- తగ్గిన రిజిస్ట్రేషన్లు
- ఈ ఏడాది అర్ధభాగంలో 73.69 శాతం ఆదాయం
- యలమంచిలిలో అతి తక్కువ రిజిస్ట్రేషన్లు
- రియల్టర్ల మోసాలతో ఆసక్తి చూపని మదుపరులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటైన స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి అనకాపల్లి జిల్లాలో ఆశించిన ఆదాయం రాలేదు. భూములు, స్థిరాస్తుల క్రయవిక్రయాలు పెద్దగా జరగక పోవడంతో రిజిస్ట్రేషన్ల శాఖ లక్ష్యానికి దూరంగా ఉంది. జిల్లాలోని పది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఈ ఆర్థిక సంవత్సరం అర్ధ భాగానికి (సెప్టెంబరుకు) రూ.180.36 కోట్ల ఆదాయం రావాల్సివుండగా, రూ.132.90 కోట్లు వచ్చింది. లక్ష్యంలో 73.69 శాతానికి చేరుకోగలిగింది. పట్టణంలోనూ, దీనికి ఆనుకొని స్థిరాస్తి వ్యాపారాలు జరగడంతో అనకాపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఒక్కటే లక్ష్యానికి దగ్గరగా 96.44 శాతానికి చేరుకోగలిగింది. యలమంచిలి కార్యాలయం 54.19 శాతానికి పరిమితమైంది. ఆదాయం పెంచుకొనేందుకు కొత్త జిల్లాల ఏర్పాటు తరువాత జిల్లా కేంద్రమైన అనకాపల్లి సహా పలు ప్రాంతాల్లో మార్కెట్ విలువ ప్రభుత్వం పెంచింది. పది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో యలమంచిలి కార్యాలయం నుంచి ఎక్కువ ఆదాయం వస్తుందని ఆశించి అనకాపల్లి కంటే లక్ష్యం ఎక్కువ విధించారు. కానీ అన్ని కార్యాలయాల కంటే ఇక్కడే తక్కువ ఆదాయం వచ్చింది. ఇంతవరకు రిజిస్ట్రేషన్లు జరిగిన 45,612 డాక్యుమెంట్లలో అనకాపల్లిలో 8979, యలమంచిలిలో 6181 ఉన్నాయి. యలమంచిలి పరిధిలో అచ్యుతాపురం, పరిసర ప్రాంతాల్లో స్థిరాస్తుల వ్యాపారం జోరుగా సాగుతుందని అంచనావేసి అధికారులు లక్ష్యం పెంచారు. సెజ్‌కు, జాతీయ రహదారికి ఆనుకొనివున్న సమీప ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారం మందకొడిగా ఉంది. ఈ ప్రాంతంలో భూములు, ప్లాట్లు క్రయవిక్రయాలు పెద్దగా జరగడంలేదు. అచ్యుతాపురం, యలమంచిలి ప్రాంతాల్లో భారీ రేట్లు ఉండడం కూడా స్థిరాస్తి వ్యాపారం ఆశించిన స్థాయిలో జరగకపోవడానికి ఒక కారణంగా అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో భూముల రేట్లు పెరగడంతో పాటు మోసాలు అధికంగా ఉన్నాయి. కొంతమంది రియల్టర్లు ఒకే భూమిని హద్దులు మార్చి, ఇద్దరు, ముగ్గురికి అమ్ముతున్న విషయాలు వెలుగుచూడ్డంతో భూములు కొనడానికి భయపడుతున్నారు. రియల్టర్ల మోసాలు బయటపడుతున్నప్పటికీ, వారిపై ఏ చర్యలూ తీసుకోకపోవడంతో మోసాలు కొనసాగుతున్నాయి. కొత్తగా ఈ ప్రాంతంలో భూములు కొనడానికి పెద్దగా ముందుకురావడంలేదు. దీంతో ఆ ప్రభావం రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయంపై పడింది.

ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఆదాయ లక్ష్యం, సాధించిన వివరాలు

సబ్‌రిజిస్ట్రార్	లక్ష్యం	ఆదాయం(కోట్లలో)	శాతం
1. అనకాపల్లి	37.82	36.47	96.44
2. చోడవరం	11.09	7.73	69.73
3. కె.కోటపాడు	3.54	2.83	79.99
4. కోటవురట్ల	6.41	4.65	72.67
5. లంకెలపాలెం	33.21	21.71	65.38
6. మాడుగుల	4.16	3.40	81.79
7. నక్కపల్లి	16.17	13.15	81.35
8. నర్సీపట్నం	12.19	9.41	77.18
9. సబ్బవరం	17.65	12.86	72.86
10. యలమంచిలి	38.08	20.63	54.19

నేరాలు ఘోరాలు

మాట్లాడుతున విద్యార్థి సంఘాల నేతలు

విద్యార్థి అనుమానాస్పద మృతి

నేడు విద్యా సంస్థల బంద్‌కు విద్యార్థి సంఘాల పిలుపు

ప్రజాశక్తి పాడేరు :- పాడేరు మండల కేంద్రంలో ఉన్న నెంబర్ వన్ స్కూల్ ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి పాంగి నవీన్ అనుమానాస్పద రీతిలో మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం వెలుగు చూసింది. నవీన్ మృతదేహం పాఠశాల ప్రక్కన కొంచెం నిర్మానుషంగా ఉండే ప్రదేశంలో ప్రహరీ గోడ ప్రక్కన పడి ఉంది. దీన్ని కొందరు విద్యార్థులు గుర్తించారు. నవీన్ మరణం పై తీవ్ర ఆందోళన దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన విద్యార్థి సంఘాలు గురువారం పాడేరు మండల కేంద్రంలో విద్యాసంస్థల బంద్ కు పిలుపునిచ్చాయి. ఈ విద్యార్థి అనుమానాస్పద రీతిలో మృతి చెందిన ఘటనపై అధికారులు తక్షణమే స్పందించి విచారణ జరిపించి వాస్తవాలను వెలుగులోకి తీయాలని ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ, జిఎస్‌యు విద్యార్థి సంఘాల నాయకులు ప్రభు, ఆనంద్, సుమన్ డిమాండ్ చేశారు. నవీన్ గత ఐదు రోజులుగా పాఠశాలకు హాజరు కావడం లేదని పాఠశాల యాజమాన్యం చెబుతున్నారని, అయితే విద్యార్థి నవీన్ పాఠశాలకు హాజరు కాకపోవడంపై వారి తల్లిదండ్రులకు సమాచారం ఎందుకు ఇవ్వలేదని ఆచూకీ కోసం ఎటువంటి చర్యలు తీసుకున్నారని వారు ప్రశ్నించారు.

బొలెరో, బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- అడ్డతీగల

అడ్డతీగల గ్రామ శివారు ప్రాంతంలో బొలెరో వాహనం, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో గంగవరం మండలం జడేరు పంచాయతీ ఏటిపల్లి గ్రామానికి చెందిన గడుతూరి చందు తలకు, ముఖానికి తీవ్ర గాయలయ్యాయి. బైక్ వెనుక భాగంలో కూర్చున్న ఆయన తండ్రి చిరంజీవి బాబుకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108 సహాయంతో ఎల్లవరం పీహెచ్సీకి తీసుకెళ్లగా, డాక్టర్ భాస్కర్ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చందుకు చికిత్స చేస్తున్న డాక్టర్

గీతం వర్శిటీలో 'ఫిట్‌నెస్ ఫ్యాక్టరీ'

పిట్‌నెస్ సాధనలో గీతం అధ్యక్షుడు శ్రీభరత్

ప్రజాశక్తి- విశాఖపట్నం : విద్యార్థులకు శారీరక వ్యాయామం ప్రాధాన్యతను తెలియజేస్తూ ఫిట్‌నెస్‌పై అవగాహన, అభిరుచి పెంచేవిధంగా గీతం స్కూల్ ఆఫ్ ఫిజియోథెరపీ విద్యార్థులు ఏర్పాటు చేసిన 'ఫిట్‌నెస్ ఫ్యాక్టరీ' పేరిట ప్రత్యేక యూత్ క్లబ్‌నుగీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ బుధవారం ప్రారంభించారు. ఫిజియోథెరపీ కోర్సు అభ్యసిస్తూనే ఇతర విద్యార్థులకు ఫిట్‌నెస్‌లో మార్గదర్శకం వహించాలన్న క్లబ్ నిర్వాహకుల ఆలోచనను అభినందించారు. యువతకు మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యం అవసరమని, అప్పుడే జీవితంలో సవాళ్ళను ఎదుర్కొనే సమర్థత చేకూరుతుందన్నారు. జిమ్‌సర్ ప్రో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్. బి.గీతాంజలి ఫిట్‌నెస్ క్లబ్ ఏర్పాటు ఆలోచనను అభినందించారు. గీతం స్కూల్ ఆఫ్ ఫిజియోథెరపీ డైరక్టర్ డాక్టర్ మాధురి కాశీ మాట్లాడుతూ విద్యార్థులు అసక్తితో ఫిట్‌నెస్‌పై దృష్టి సారించేలా జుంబా డాన్స్, హిప్ హప్ నత్యాలు, యోగా, బాలివుడ్ గీతాలకు ఫిట్‌నెస్ నత్యాలను క్లబ్ ద్వారా ప్రోత్సహిస్తామన్నారు. అలాగే ఫిట్‌నెస్‌కు సంబంధించిన సందేహాలు, మెలకువలు, సమస్యలకు క్లబ్ ద్వారా పరిష్కారం చూపుతామన్నారు.

రీజనల్ పాలిటెక్ ఫెస్ట్ ప్రారంభం

జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న మేయర్

ప్రజాశక్తి -కంచరపాలెం : విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు టెక్ ఫెస్టులు ఎంతో దోహదపడతాయని విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. ఏయూ రీజియన్‌లోని పాలిటెక్నిక్ కళాశాల టెక్ ఫెస్ట్‌ను కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపల్ జివివి. సత్యనారాయణతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధిని పెంచేందుకు ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తుందన్నారు.పాలిటెక్నిక్ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవలన్నారు.

ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించి విద్యార్థులకు సలహాలు సూచనలు అందించారు. ఈ ఫెస్టులో 22 ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ విద్యార్థులు 126 ప్రాజెక్టులతో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ మాజీ జాయింట్ డైరెక్టర్, కాలేజ్ గవర్నింగ్ బాడీ చైర్మన్ ఎస్‌వియుఎం. ప్రసాద్. ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కెవి రమణ, పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ ఓఎస్‌డి యన్.చంద్రశేఖర్, అనకాపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్ ఐవిఎస్ శ్రీనివాసరావు, చోడవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ ఓఎస్‌డి ఎ.నాగరాజు, పాడేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్ కె.సుజాత పాల్గొన్నారు.

శ్రీనివాస ప్రసాద్‌కు ఎయు డాక్టరేట్

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు చేపలుప్పాడ పరిధిలోని చిన ఉప్పాడకు చెందిన మైలపల్లి శ్రీనివాస ప్రసాద్‌కు ఆంధ్రా యూనివర్సిటీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగంలో డాక్టరేట్ లభించింది. 'విశాఖ డిస్ట్రిక్ట్ ఏ కంపేరిటివ్ అనాలిసిస్' పేరిట సమర్పించిన పరిశోధనాపత్రాలకు శ్రీనివాసప్రసాద్‌కు ఎయు డాక్టరేట్ ప్రకటించింది.

18న జాబ్‌మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం మోడల్ కెరీర్ సెంటర్లో ఈ నెల 18న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి(టెక్నికల్) కె .సుధ తెలిపారు. ది పార్క్ హోటల్, రిలయన్స్ జియో, ఎస్‌బిఐ, బ్యాంకు ఆఫ్ బరోడా, హెచ్‌డిఎఫ్‌సి, ఐసిఐసిఐ, కొటక్ మహీంద్రా, పేటిఎం, స్విగ్గీ వంటి కంపెనీల్లో వెయ్యి ఉద్యోగాల భర్తీలు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు

ట్రైనీలు, హోమ్ సేల్స్ ఆఫీసర్, బ్రాంచ్ రిలేషన్ షిప్ మేనేజర్, ఫ్రంట్ ఆఫీసర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, పిక్కర్స్ ప్యాకర్స్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, డిప్లమో ఉత్తీర్ణులైన 18 -45 ఏళ్ల స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులన్నారు.ఆయా ఉద్యోగాన్ని బట్టి రూ.12,500 నుంచి రూ.20,500 వరకు నెలసరి జీతం ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ncs.gov in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో...

కంచరపాలెం ఐటిఐ జంక్షన్‌లోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 18న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సెంటర్ సబ్ రీజినల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎన్.శ్యాంసుందర్ తెలిపారు. మారుతి సుజుకి, జయభేరి ఆటోమొబైల్స్ కంపెనీల్లో సేల్స్ ఎగ్జిక్యూటివ్, సీనియర్ టెక్నీషియన్, సర్వీస్ అడ్వైజర్, టెలీకాలర్స్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఉద్యోగాన్ని బట్టి రూ.13,500 నుంచి రూ.26 వేలు వరకు జీతం ఉంటుందన్నారు .ఆసక్తి గల అభ్యర్థులు ncs gov in సైట్‌లో పేర్లు నమోదు చేసుకుని ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

గిరిజన ఉపాధ్యాయుల సదస్సును జయప్రదం చేయండి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు

ప్రజాశక్తి -విఆర్.పురం

అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో ఈనెల 20న జరగనున్న గిరిజన ఉపాధ్యాయుల రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సోడే నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం వివిధ పాఠశాలల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పాడేరు సదస్సులో విద్య ఉపాధ్యాయ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ఈ సదస్సు రావడానికి సిద్ధమవుతున్నారని, గిరిజన సంక్షేమ ఉపాధ్యాకయులందరూ ఇందులో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్, జగదీష్, నాయకులు నూనె రామకృష్ణ, అజయ్, మంగారెడ్డి, శాంతకుమారి, బాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు

ఎస్‌సి,ఎస్‌టి రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి- ఉక్కునగరం : స్టీల్ ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఉద్యోగవిరమణ పొందిన సభ్య ఉద్యోగులను బుధవారం అసోషియేన్ కార్యాలయం వద్ద సన్మానించారు. ముందుగా బాబాసాహెబ్ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్, బిర్సాముండా విగ్రహాలకు హెచ్‌ఆర్ విభాగ జనరల్ మేనేజర్ కంచర్ల సంజీవరావు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. 62 మందికి రూ.20వేలు చొప్పున రూ. 12.50లక్షల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేసన్ అధ్యక్ష కార్యదర్శులు బోండా తౌడన్న, బయ్యే మల్లయ్య, అడ్వైజరీ కమిటీ ప్రతినిధి బూల జగ్జీవన్-ామ్, చిరంజీవి, బూక్య లాలు, దాకే సువర్ణరత్నం, కెపివి సుబ్రమణ్యం, కారు రమణ, కర్రా ప్రకాష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్‌వి రమణ రావు, సెక్రటరీ ఎస్.మోహన్‌బాబు, పుల్లారావు , కోశాధికారి కెవి రత్నం, బిడి నాయక్, లక్ష్మణమూర్తి, పైడి కొండలరావు, మోరి గణేష్, కిషోర్ సింగ్, వేణు గోపాలరావు పాల్గొన్నారు.

ఫిట్స్ నియంత్రణకు మందులు

కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ న్యూరాలజిస్ట్ డాక్టర్ సిహెచ్ విజయ్‌కుమార్

ప్రజాశక్తి -గాజువాక : ఫిట్స్ నియంత్రణకు మందులు అందుబాటులోకి వచ్చాయని కిమ్స్ ఐకాన్ న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఫిట్స్ (మూర్ఛవ్యాధి)ని గుర్తించడం కీలకమని, తర్వాత చికిత్స చేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. మందులతో తగ్గని ఫిట్స్‌కు ఆపరేషన్,ఫేస్ మేకర్ ద్వారా తగ్గించవచ్చన్నారు. ప్రతి వెయ్యి మందిలో నలుగురికి ఫిట్స్ ఉంటుందన్నారు.

సాధారణంగా రెండేళ్లలోపు పిల్లలకు, 50-60 ఏళ్ల వారికి ఫిట్స్ వస్తుందన్నారు. మెదడులోని ఒక భాగానికి అవసరానికి మించి శక్తి ప్రసారం కావడమే ఫిట్స్‌కు కారణ మన్నారు. ఫిట్స్ వ్యాధి నిర్ధారణకు ఇసిజి పరీక్ష నిర్వహిస్తామని, అసాధారణ విద్యుత్ శక్తి ఏ భాగానికి వస్తుందో నిర్ధారించుకుని, దీని ద్వారా ఫిట్స్ ధ్రువీకరిస్తామన్నారు.రోగులు అప్రమత్తంగా ఉండి వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు.

డాక్టర్ సిహెచ్ విజయ్‌కుమార్

గీతం విడిసి ఆధ్వర్యంలో 'టింకరింగ్ డే'

ప్రజాశక్తి- విశాఖపట్నం : పాఠశాలల విద్యార్థులలో నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంచేవిధంగా కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రారంభించిన అటల్ టింకరింగ్ ప్రయోగశాలల సంఖ్య పదివేలు దాటిన సందర్భంగా బుధవారం టింకరింగ్ డే పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ (విడిసి) శిక్షకులు నగరంలోని వివిధ పాఠశాలలకు వెళ్ళి సూక్ష్మ ప్రాజెక్టలపై అవగాహన కల్పించారు. నూతన ఆవిష్కరణలు, వాటి ప్రయోజనం, స్టార్టప్ వాతావరణం, అటల్ ఇన్నోవేషన్ మిషన్ లక్ష్యాలతో పాటు పాఠశాల విద్యార్థులు బందంగా ఏర్పడి నూతన ఆలోచనలపై ఏవిధంగా దృష్టి నిలపాలనేనే అంశాలను వివరించారు. 30 నిమిషాల వ్యవధితో ఉండే ప్రాజెక్టులను అటల్ టింకరింగ్ ప్రయోగశాలలో తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు. గీతం విడిసి కోచ్ బి.రాజ్‌కుమార్, వెంకట గౌతమ్, సంధ్యారాణి, రాహూల్ ఉప్పసాల కార్యక్రమాలను పర్యవేక్షించారు.

విద్యార్థులకు ఆవిష్కరణపై అవగాహన కల్పిస్తున్న కోచ్‌లు

23లోగా దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాలాక్షినగర్ దయాల్‌భాగ్ ఇనిస్టిట్యూట్‌లో వివిధ కోర్సులకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఇనిస్టిట్యూట్ ఇన్‌ఛార్జి దక్షిణామూర్తి తెలిపారు. పదోతగరగతి అర్హతతో డ్రెస్ డిజైనింగ్ అండ్ టైలరింగ్, టెక్స్‌టైల్ డిజైనింగ్, ఎలక్ట్రీషియన్, 8వ తరగతి విద్యార్హతతో బ్లాక్ ప్రింటింగ్, టై అండ్ డై కోర్సులకు ఈ నెల 23లోగా దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 99633 40611ఫోన్ నెంబరుకు సంప్రదించాలన్నారు.

కౌలు రైతు రుణ విముక్తికి ఉద్యమించాలి

కేరళ తరహాలో పంట కొనుగోలు పద్ధతి పాటించాలి

కౌలు రైతులందరికీ సిసిఆర్ కార్డులివ్వాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో కౌలు రైతులందరూ కౌలు రైతు రుణ విముక్తి చట్టం కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయం స్వరాజ్యనగర్ పెంటకోట జగన్నాథం ప్రాంగణంలో బుధవారం కౌలు రైతు సంఘం జిల్లా నాలుగో మహాసభ నిర్వహించారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టెక్కలి జగ్గారావు, రామ సదాశివరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా హరిబాబు మాట్లాడారు. రాష్ట్రంలో 32 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారని తెలిపారు. వీరిలో కేవలం 5 లక్షలా 74 వేలమందికి గుర్తింపు కార్డులు ఇస్తామని ఐదు లక్షలు కూడా ఇవ్వలేదని చెప్పారు. వీరిలో 15 వేల మందికి మాత్రమే రైతు భరోసా ఇవ్వడం దారుణం అన్నారు. కౌలు రైతుల జీవితాలు త్రిశంకు స్వర్గంలో ఉన్నాయన్నారు. ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలని, కేరళ తరహాలో ప్రైవేటు వ్యవసాయ అప్పులను సైతం రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా కౌలు రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడలేదన్నారు. దీనికోసం ఐక్య ఉద్యమం తప్పనిసరి అన్నారు. గుర్తింపు కార్డు ఉన్న ప్రతి కౌలు రైతుకూ రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. దేవాదాయ భూముల వాస్తవ సాగుదారులకు కూడా ఈ చట్టం వర్తింపజేయాలన్నారు.

జిల్లా కౌలు రైతు సంఘం గత మూడేళ్లలో చేసిన కార్యక్రమాలు, ప్రగతి నివేదికను సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.బాలకృష్ణ చదివి వినిపించారు. జిల్లా మహా సభల ప్రారంభానికి ముందు అమరవీరులు పుచ్చలపల్లి సుందరయ్య, మల్లు స్వరాజ్యం, పెంటకోట జగన్నాథం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఇటీవల జరిగిన రైతు ఉద్యమాల్లో అసువులు బాసిన అమరవీరులకు సంతాపం ప్రకటించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కె.లోకనాథం, జిల్లా రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు కర్రి అప్పారావు, ఎం.అప్పలరాజు, కౌలు రైతు సంఘం నాయకులు ఆళ్ళ మహేశ్వరరావు, కాండ్రేగుల రాము, కాళ్ల తేలయ్యబాబు, గండి నాయనబాబు, ఎస్‌వి నాయుడు తదితరులు పాల్గొన్నారు.